# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శాసనసభలో ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.
- ❖ మార్కాపురం జిల్లా రాయవరం బస్సు ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- ❖ రాష్ట్రంలో వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ కు ఎటువంటి కొరతా లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక ఈ ఆదివారం ప్రసారం కానుంది.

========================

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూఈ నెల 28న జరిగే శాసనసభ ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టనున్న తీర్మానానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్-5ను సవరించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీలో ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. అంతేకాకుండా, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (CRDA) చట్టంలో 'కొత్త రాష్ట్ర రాజధాని' అనే పదానికి బదులుగా 'అమరావతి' అనే పదాన్ని చేర్చాలని కూడా నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే కేంద్రాన్ని కోరారు. ఈ విషయమై రాష్ట్ర శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం, దానిని తమకు పంపాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

========================

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు నిర్ణయాలను సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి వెలగపూడిలోని సంచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన

చట్టం-2014లోని సెక్షన్-5ను సవరించాల్సిందిగా క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటుకు సైతం ఆమోదం తెలిపింది. గుంటూరు జిల్లా నీరుకొండలో SRM యూనివర్సిటీకి 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాలు నిర్మించుకోవడానికి అనుమతులిస్తూ నిర్ణయం తీసుకుంది. గృహాలకు పైప్డ్ లైన్ నేచురల్ గ్యాస్ (PNG) వాడుకునే వినియోగదారులకు రాయితీని పొడిగించే ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపింది. అదే విధంగా ఈ సమావేశంలో కీలకంగా నిలిచిన రాజధాని అమరావతికి చట్టబద్ధత అంశంపై మంత్రి పార్థసారథి వివరణ ఇస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

========================

రాష్ట్రంలో వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ కు ఎటువంటి కొరతా లేదని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ల పెంపుపై వెలగపూడి సచివాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల్లో లక్షకు పైగా పీఎన్జీ కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్యాస్, పెట్రోలు, డీజిల్ పై సామాజిక మధ్యమాల్లో వచ్చే వదంతులు నమ్మవద్దని అన్నారు. విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర నగర ప్రాంతాల్లోని ఎల్పీజీ వినియోగదారులను ఆయా నగరాల్లో పిఎన్జీ వైపు మళ్లించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పిఎన్జీ ద్వారా గ్యాస్ నిరంతర సరఫరా అందుబాటులో ఉండడంతో పాటు అపార్ట్‌మెంట్లు, పారిశ్రామిక యూనిట్లు ఈ సదుపాయాన్ని వినియోగిస్తే కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు లభిస్తాయని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

========================

కేంద్ర ప్రభుత్వం క్రీడల మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని 14 కోట్ల రూపాయల ఖేలో ఇండియా నిధులతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంకు పెమ్మసాని చంద్రశేఖర్ ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు మనుషులలో క్రమశిక్షణ, ఐక్యతను పెంచుతాయన్నారు. సమగ్రాభివృద్ధికి కేవలం ఇంజనీరింగ్, సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు మాత్రమే కాకుండా పర్యాటకం, క్రీడా రంగాలు కూడా అభివృద్ధి చెందాలని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

========================

మార్కాపురం జిల్లా రాయవరం వద్ద ఈ తెల్లవారు జామున జరిగిన బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సాయంపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సంఘటనా స్థలాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అనిత తెలిపారు. ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరుపుతామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరుగకుండా భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేస్తామని హోం మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

అదే విధంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... అధికారులు తక్షణమే స్పందించి ప్రమాద స్థలానికి చేరుకుని పలువురిని రక్షించారని చెప్పారు. క్షతగాత్రుల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

========================

గ్రామీణ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని.. దానిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ సంఘ సహాయకులకు (VAO) లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో ఈరోజు మాట్లాడుతూ.... డ్వాక్రా సంఘాల ద్వారా గ్రామాల్లో 90 లక్షల మంది మహిళలు 8.32 లక్షల స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా స్వయం కృషితో ఎదుగుతున్నారని తెలిపారు. ఈ సభ్యుల నుంచి ప్రతి గ్రామంలోనూ ఒక గ్రామ సంఘ సహాయకురాలు (VAO)గా ఉన్న వారు తమ సంఘ సభ్యులకు శిక్షణ ఇవ్వడంతో పాటు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి, సీఐఎఫ్ లాంటి ఇతర ఆర్థిక పథకాల ద్వారా సభ్యులకు సాయం అందిస్తున్న నేపథ్యంలో వీరికి స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

========================

రాజధాని అమరావతిలో 11 లక్షల చదరపు అడుగుల్లో అసెంబ్లీ నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. రాజధానిలోని అసెంబ్లీ నిర్మాణంలో సెంట్రల్ హాల్ కు పైలింగ్ పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమరావతి గ్రోత్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... అసెంబ్లీ భవనం పైన 250 మీటర్ల ఎత్తులో టవర్ ఉంటుందని, సందర్శకులు టవర్ పైకి వెళ్ళి అమరావతి మొత్తం చూసేలా డిజైన్ చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర సంస్కృతి ఉట్టిపడేలా ఈ భవనాన్ని నిర్మించనున్నారని తెలిపారు. అసెంబ్లీ భవనాన్ని నాలుగు భాగాలుగా విభజించి నిర్మాణం చేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

========================
========================